

# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక

5-2-2001 (4)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 23-01-2001 | మంగళవారం | ఆకివీడు |
| 05-02-2001 | సోమవారం | చించినాడ, గీతామందిరం |
| 08-02-2001 | గురువారం | కేశవరం |
| 18-02-2001 | ఆదివారం | గుండుగొలను |
| 19-02-2001 | సోమవారం | గణపవరం |
| 20-02-2001 | మంగళవారం | పడమర విప్పర్రు |
| 21-02-2001 | బుధవారం | చించినాడ (శివరాత్రి) |
| 25-02-2001 | ఆదివారం | సామర్లకోట |
| 04-03-2001 | ఆదివారం | నరసాపురం |
| 07-03-2001 | బుధవారం | ఆత్రేయపురం |
| 10-03-2001 | to 20-03-2001 | అరుణాచలం క్యాంప్ |
| 25-03-2001 | ఆదివారం | గుమ్మలూరు |
| 30-03-2001 | శుక్రవారం | జిన్నూరు – శ్రీ రమణ క్షేత్రం |

**ది. 14-12-2000 గురువారం అరుణాచలంలో**
**శ్రీనాన్నగారు ఆశ్రమం గృహప్రవేశ ఛాయా చిత్రం**





ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

సంపుటి : 6 సంచిక : 4 పుష్యం : 11-13 5-2-2001

**RAMANA BHASKARA**
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE
PAGES : 20

VOL: 6 ISSUE: 4

EDITOR
P. S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI (HYMA)

SUBSCRIPTION
YEARLY : Rs. 140/-
Each Copy : Rs. 10/-

ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438, 24278

## జ్ఞానుల దృష్టిలో కామినీ కాంచనాలు

దక్షిణేశ్వరం, కలకత్తాలో కాళికాదేవి ఆలయం నిర్మించినది రాణి రాసమణిదేవి. వారి అల్లుడు మధురనాథ్ బిశ్వాస్ శ్రీ రామకృష్ణపరమహంసగారి శిష్యుడు. ఆయన పరమహంసను పరీక్షించడానికి, షికారు అని చెప్పి హృదయుడుతోపాటు, కలకత్తాలో మెచువా బజారులో లక్ష్మి అనే వేశ్య వద్దకు తీసుకు వెళ్ళాడు. లక్ష్మిని చూడగానే పరమహంస మాతా అని సంబోధించి, ఆమెలో కాళీమాతను దర్శించి ఆమెకు పాదనమస్కారం చేసి, సమాధిస్థితిలోనికి వెళ్ళినారు. అట్టిది వారి యొక్క ఆధ్యాత్మిక ఔన్నత్యము.

ఒకసారి ఆధ్యాత్మిక నృత్యనాటిక జరిగిన తరువాత నటులకు బహుమతిగా ఇచ్చుటకు పది, పదిరూపాయిల నోట్లు మొత్తం వంద రూపాయిలు మధురనాథ్ పేర్చినారు. బహుమతి ఇచ్చే సమయంలో శ్రీరామకృష్ణ పరమహంస మొత్తం వంద రూపాయిలు ఒకే నటునికి ఎంతో సంతోషముగా ఇచ్చినారు. తిరిగి మధురనాథ్ వంద

తరువాయి 20 పేజీలో...

### ఈ సంచికలో ....

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

09-12-2000, విశాఖపట్నం .............................. 2
25-11-2000, వేండ్ర .............................. 7
24-12-2000, జిన్నూరు .............................. 13

రూపాయిలు ఇతరనటులకు ఇచ్చుటకు పేర్చినారు. రెండవనటునికి మొత్తం వంద రూపాయిలూ పరమహంస ఇచ్చివేసినారు. తిరిగి మూడవనటుడు బహుమతి కోసం వచ్చినప్పుడు, అక్కడ ఇచ్చుటకు ఏమీలేనందున వారి పంచె విప్పివైచి ఆ నటునికి ఇచ్చినారు. జ్ఞానానికి లెక్క ప్రకారం దానం చేయటం ఉండదు. అది పసిబాలుని పోలిన అమాయకత్వం, కాని జ్ఞానంతో కూడినది. వారు మట్టిని, బంగారమును ఒకేలా చూసేవారు.

మరణానుభవం తరువాత శ్రీ రమణమహర్షి ప్రతీవారిని ఆత్మ స్వరూపులుగా గుర్తించిన మూలాన, ఆయనకు దేహభావన లేదుగనుక వారికి దేహానికి సంబంధించిన కామవాంఛ కలిగే అవకాశం లేదు. ఇది అత్యున్నతమైన అవగాహన.

శ్రీ రమణ మహర్షిగారు డబ్బును ఎప్పుడూ ముట్టలేదు. మీరు ఎందుకు డబ్బు ముట్టుకోరు అనగా నా అవసరములు నా పరిచారకులు చూస్తున్నారు. ఫలములు ఇటువంటివి తినటానికైనా పనికొస్తాయి, డబ్బును తింటామా అనేవారు.

శ్రీ షిరిడీసాయి బాబాకు ఎవరైనా విరాళము ఇస్తే సాయంత్రం లోపల, ఎవరో ఒకరికి అవసరమున్న వారికి ఇచ్చివేసేవారు.

జ్ఞానులందరూ ఈ కోవలోనివారే. కామిని కాంచనములు దాటకుండా మనము మాయను జయించలేము. కామిని కాంచనములకు మనము మానసికముగా అతీతము కావలెను, భౌతికంగా దూరంగా ఉండి మనస్సులో ఆకర్షణ ఉండటం కాదు.

నిండు సభలో నిత్య బ్రహ్మచారి ఎవరైనా నిలబడమన్నప్పుడు శ్రీ కృష్ణపరమాత్మ ఒక్కడే లేచి నిలుచున్నాడు. పెళ్ళికాని భీష్ముడు కూడా లేచి నిలబడలేదు. జనకుడు రాజ్యమేలినప్పటికీ వారికున్న వైరాగ్యము ఎవరికీ లేదని శ్రీ కృష్ణపరమాత్మ గీతలో చెప్పారు. అట్టివారికి మాత్రమే మాయ దారి ఇచ్చి, ఆత్మజ్ఞానము కలిగేలా చేస్తుంది. కామినీ కాంచనాలకు మానసికంగా దూరంగా ఉండండి. వాటి భ్రమలో పడి భ్రష్టత్వం పొందకండి.

....ఎడిటర్

అరుణాచల శివ. అరుణాచల శివ. అరుణాచల శివ. అరుణాచలా

## బహిర్ముఖమనస్సే దుఃఖం - అంతర్ముఖ మనస్సే సుఖం

ది. ౦౯-౧౨-౨౦౦౦ విశాఖపట్నంలో శ్రీ P.S.N. రాజు, శ్రీ I.S.N. రాజు మరియు రమణ భక్తులు దీపోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సభలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు అరుణాచల దీపోత్సవం. బ్రహ్మదేవునికి, విష్ణుదేవునికి నేను గొప్ప అంటే నేను గొప్ప అని వివాదం వస్తుంది. వారి వివాదం తీర్చటానికి పరమేశ్వరుడు అరుణాచలంలో జ్యోతిస్థంబం రూపంలో దర్శనం ఇచ్చి నామొదలు, చివర ముందు ఎవరు చూసివస్తారో వారుగొప్పవారు అని చెప్పాడు. అప్పడు బ్రహ్మ హంసరూపంలో చివరచూడటానికి వెళ్ళాడు, విష్ణువు వరాహరూపంలో మొదలు చూడటానికి వెళ్ళాడు. ఆయనకు చివర కనపడలేదు, ఈయనకు మొదలు కనపడలేదు. మొదలు , చివర ఉంటే కనబడుతుంది. పరమేశ్వరుడికి ఆది,అంతం లేదు. అప్పడు వారు ఓటమిని అంగీకరించి ఇంత జ్యోతిని ఎలా ఆరాదించటం అని అడిగితే మొదట గిరిరూపం తరువాత లింగరూపం ధరించాడు. ఆది లింగం, తొలి లింగం అరుణాచలలింగం. దీనిని అగ్నిలింగం అనిపిలుస్తారు. ఆవూరి పేరు అరుణాచలం, ఆదేవుడి పేరు అరుణాచలం, అక్కడ కొండ పేరు అరుణాచలం. పరమేశ్వరుడు బ్రహ్మ విష్ణువులకు అందలేదు అంటే నీ మాటకు, మనస్సుకు అందడు అనిఅర్ధం. నిజమైన అరుణాచలం నీ హృదయంలోనే ఉంది. అది నీమాటకు, మనస్సుకు అందదు, మాట, మనస్సు అణిగితే అది నీ చేతికి అందుతుంది. అప్పడు జనన, మరణ చక్రం నుండి విడుదల పొందుతావు.

భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు కాని మనకు తెలియటం లేదు. మనలో ఉన్న బలహీనతల వలన, అపవిత్రత వలన భేదభావం వలన మన హృదయంలో ఉన్న ఈశ్వరుడు మనకు అందటంలేదు. అగ్నిలింగమైన అరుణాచలాన్ని స్మరించగా, స్మరించగా మనలో ఉన్న బలహీనతలు, అపవిత్రత కాలి బూడిదఅవుతుంది. అప్పడు మన హృదయంలో ఉన్న ఈశ్వరుడు మనకు తెలియబడతాడు. దేహం పుట్టినప్పడు నేను పుట్టాను అనుకొంటున్నావు అది నిజంకాదు. నేను అనే తలంపు పుట్టినప్పడు నీవు పుట్టావు. నేను అనే తలంపుకు జన్మస్థానం మన హృదయమే. ఎక్కడైతే ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నానని చెప్పాడో అక్కడ నుండే నేను అనే తలంపు వస్తోంది. మనం నేను అనే తలంపును

గుర్తుపెట్టుకుంటున్నాము కాని ఆనేను యొక్క జన్మస్థలాన్ని మర్చిపోతున్నాము, అది మనకు జ్ఞాపకం లేదు, అది మన స్వస్థలం అని మర్చిపోయాము. మన స్వస్థలం అయిన మన హృదయంలో మనం ఉండగలిగితే నేను అనే తలంపు పత్తా లేకుండా పోతుంది. మనస్సే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. అదే మొదటి తలంపు. మొదటి తలంపు దగ్గర ఉన్న రోగం ఏమిటి అంటే శరీరంతో తాదాప్యం పొందుతుంది. కొంతమందితో స్నేహం, కొంత మందితో విరోధం పెట్టుకుంటుంది. దేహం నేను అనే తలంపు ఎంత నిజమో ఈ స్నేహాలు, విరోధాలు కూడా అంతే నిజం. దేహగతమైన నేనుతో వచ్చే అనుబంధం నిలబడదు. మన హృదయంలో ఉన్న సత్యంతోటి అనుబంధం పెట్టుకోకుండా ఇలా దేనితో ఒక దానితో తాదాప్యం పొందే నేనుతో అనుబంధం పెట్టుకొని బంధంలో పడుతున్నాము. ఇది మనం గ్రహించాలి. ఒక రూపంతో గాని, ఒక నామంతో గాని, ఒక ప్రదేశంతోగాని తాదాప్యం లేకుండా మీకు ఏదైనా కోరిక వస్తే అది కోరికే కాదు అది నిన్ను బంధించదు. ఒక రూపంతో గాని, ఒక నామంతోగాని, ఒక ప్రదేశంతోగాని ఇలా దేనితోనూ సంబంధం లేకుండా పని చేస్తూ ఉంటే అది కర్మకాదు అది అకర్మ అవుతుంది, అప్పుడు నీవు చేసేపని నిన్ను బంధించదు.

అరుణాచలాన్ని స్మరించగా, స్మరించగా అహంవృత్తి నశిస్తుంది, అహంస్ఫురణ కలుగుతుంది. అహంవృత్తికి తాదాప్యం ఉంటుందిగాని అహంస్ఫురణకు దేనితోనూ తాదాప్యం ఉండదు, వారు దేహం ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా ఒకేలాగ ఉంటారు ఎందుచేతనంటే దేహంతో దానికి సంబంధం లేదు, దేహం ప్రారబ్ధానికి సంబంధించినది. అహంభావనకు దేహం అవసరంగాని నీలోపల ఉన్న చైతన్యానికి దేహంతోగాని, లోకంతోగాని సంబంధంలేదు. మనస్సు అణగాలి. మనస్సు అణగాలంటే శారీరక తపస్సు, మానసిక తపస్సు, వాక్కు తపస్సు అవసరమని భగవంతుడు చెప్పాడు. ఇలాచేస్తే మనస్సు అణుగుతుంది. అణిగిన మనస్సుకి అంతర్ముఖత్వం వస్తుంది. మనస్సు అంతర్ముఖం అయిననాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనస్సు బహిర్ముఖమయితే ప్రవృత్తి, దు:ఖం, అశాంతి. మనస్సు అంతర్ముఖమయితే నివృత్తి, సుఖం, శాంతి. నీ మనస్సు అంతర్ముఖమవుతుందో, బహిర్ముఖమవుతుందో చూసుకో. భగవాన్ ఎప్పుడూ అరుణాచలేశ్వరుని దేవుడు అనలేదు, తండ్రీ అనేవారు. మన ఇంట్లో వ్యక్తులను మనం ఎలాచూసుకుంటున్నామో అరుణాచలేశ్వరుడుని అలా చూసుకొన్నారు. శివ అనేటప్పటికి

ఆయనకు జనక భావన వచ్చేది గాని దేవుడు భావం ఎప్పడూ రాలేదు. భగవాన్ కు అరుణాచలేశ్వరుడితో జన్మాంతర అనుబంధం ఉంది. నేను యజ్ఞాలు యాగాలు చేయలేదు. ఎవరో అరుణాచలం అని చెపితే అది నాచెవిలో పడింది అరుణాచలా, అరుణాచలా అని స్మరించాను వెంటనే అతి వేగంగా నన్ను హృదయంలోనికి లాగేసావు, నీ హృదయంలో శాశ్వతంగా స్థానం ఇచ్చావు అని భగవాన్ అరుణాచలేశ్వరునితో అన్నారు. కైలాసంలో శివుడు ఉన్నాడు అని చెపుతారు. అరుణాచలంలో శివుడు ఉండటం కాదు ఆకొండే శివుడు. నీవు కరుణా సముద్రుడవు, దయా సముద్రుడవు. మాంసపు నేత్రాలకు రాళ్లగుట్టలాగ కనిపిస్తున్నావు. నీవు దయగలవాడవు అందువలన నాపట్ల దయచూపించి నన్ను ఏలుము అరుణాచలా. ఇప్పడు నామనస్సు నాకు యజమానిగా ఉంది, నారాగద్వేషములు నాకు యజమానిగా ఉన్నాయి. వాటిని బయటకు లాగి ఆస్థానంలో నీవు కూర్చొని నీవు నాకు యజమానిగా ఉండాలి. నామనస్సు చెప్పినట్లు నేను చేయటం కాదు నీవు ఎలా చెపితే అలానేను చేయాలి అలాగ నన్ను అనుగ్రహించు అని భగవాన్ అరుణాచలేశ్వరుని ప్రార్థించారు.

నేను అనే తలంపు మనకు ఉంది. దానిని బట్టి మిగతా వృత్తులు అన్నీ ఉంటాయి. ఈనేను అనే తలంపు యొక్క మూలం పుస్తకాలలో లేదు, నీహృదయంలో ఉంది. నేను అనే తలంపును దాని పుట్టిల్లు అయిన హృదయంలోనికి వెళ్ళే వరకూ దానిని ఉపసంహరించాలి, అదే సాధన. నేను అనే తలంపు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది. వేదం కర్మను ప్రోత్సహించలేదు, నిష్కామకర్మకు ప్రోత్సాహం ఇచ్చింది. మనం స్వార్థంతో పనిచేస్తే అది మన పీకకు చుట్టుకుంటుంది. స్వార్థం లేకుండా పనిచేస్తే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, చిత్తశుద్ధి వలన మోక్షం కలుగుతుంది. కర్తలేని కర్మచేయమని చెప్పారు. నేను చేస్తున్నాను అనే సంబంధం వదులుకోమని చెప్పారు. ఆసంబంధం వదులుకుంటే నీవు చేసే కర్మ అకర్మ అవుతుంది. అప్పడు నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనేగేటు ద్వారా శాంతి సముద్రంలో నీవు ఐక్యమవుతావు. అన్ని కంఫర్ట్సు ఉండగా ఈశ్వరుడిని ప్రార్థించేబుద్ధిమాకులేదు, అన్నీ పోయిన తరువాత మాకు నీవు జ్ఞాపకం వస్తావు. మాకు ఏదైనా కష్టం వచ్చినప్పడు దేవుడిని స్మరిస్తాము, కష్టం లేనప్పడు దేవుని స్మరించము మాబుద్ధి అలావుంది. నీవు దయాస్వరూపుడవు కాబట్టి మాపాడు బుద్ధిని తొలగించి మమ్ము అనుగ్రహించు, మాఅశాంతిని తొలగించి

, నీ శాంతి మాకు ఇవ్వుఅని అరుణాచలేశ్వరుని ప్రార్థించారు. కోరికలు దృష్టిలో పెట్టుకొని చాలామంది భగవంతుని ప్రార్థిస్తారు. అలాకోరికలతో ప్రార్థించగా. ప్రార్థించగా అప్పడు ఈశ్వరుడి మీద ప్రీతి కలుగుతుంది. ప్రీతి కలిగిన తరువాత వాడి మనస్సు పక్వస్థితికి వస్తుంది. అప్పడు నీవేకావాలి ఇంకేమివద్దు అని భగవంతుడిని ప్రార్థిస్తాడు. ఈశ్వరానుగ్రహం పొందటం మీదేదృష్టిని కేంద్రీకరిస్తాడు. అప్పడు కోరిక నెరవేరిందో, లేదో అనేదానిమీద వాడిలక్ష్యం ఉండదు. మనస్సు పక్వస్థితికి వచ్చినప్పడు వాడు సమానంగా ఉంటాడు. వాడిలో యాక్షన్ ఉంటుంది గాని రియాక్షన్ ఉండదు.

మనకు గర్వం ఉంది. కాని మనకు గర్వం లేదు అనుకుంటున్నాము. అందువలన మన హృదయంలో ఉన్న వస్తువు మనకు తెలియటం లేదు. గర్వం ఉందో లేదో లోచూపు ఉన్న వాడికి తెలుస్తుంది. లోచూపు లేనివాడికి లోపల ఏముందో తెలియదు. భగవంతుని ప్రార్థించగా, ప్రార్థించగా ఆయనే ఒక రూపం ధరించి కాళ్ళు, చేతులు తొడుక్కుని ఒక నోరు వేసుకొని నీకు బోధించటానికి వస్తాడు. వాడే గురువు. గురువు అంటే ఈశ్వరుడే. నీపూజాఫలంగా ఈశ్వరుడే గురురూపం ధరించి భూమి మీదకు వస్తాడు. గురువు బ్రహ్మం గురించి భోదిస్తూ ఉంటాడు. భోదించేటప్పడు దానిని మీరు అందుకోలేరు. ఎందుచేతనంటే ఏదోవాసన అడ్డువస్తూ ఉంటుంది. ఆవాసన కూడా వాడు చూస్తూ ఉంటాడు. ఆవాసన తొలగించుకోవటానికి లోపల నుండి శక్తిని పంపిస్తూ ఉంటాడు. బయట ఉన్న గురువు ఆత్మజ్ఞానం గురించి భోదిస్తూ ఉంటాడు. ఆత్మానుభవం కలగటానికి ఏబలహీనతలు నీలోపల ఉన్నాయో లోపలగురువు చూసుకుంటూ వాటిని నెమ్మదిగా తొలగించి నిన్ను లోపలకు తీసుకొని వెళతాడు. ఆరోజుకారోజు, ఆసంవత్సారానికి ఆసంవత్సరం, ఆజన్మకు ఆజన్మ నిన్ను డీపెన్ చేస్తూ ఉంటాడు. బయటగురువు నిన్ను లోపలకు నెట్టుతాడు, లోపలగురువు నిన్ను లోపలకు గుంజుకుంటూ ఉంటాడు. బయట గురువు, లోపల గురువు వేరు కాదు ఇద్దరూ ఒక్కటే వాడే ఈశ్వరుడు. మనస్సును లోపలకు నెట్టటానికి గురువు చూస్తూ ఉంటాడు, కాని ఏదో బలీయమైన వాసన ప్రకృతిలోనికి లాగేస్తుంది. మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళటం మానదు, గురువు బోధించటం మానడు నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వచ్చేవరకూ దాని గురించి భోదిస్తూ ఉంటాడు. ఒకోసారి అతి సన్నిహితంగా నీతో చనువుగా మాట్లాడుతూ ఉంటాడు. ఒక్కోసారి నీతో మాట్లాడడు

దూరంగా ఉంటాడు. ఒక్కోసారి కోపం నటిస్తాడు, ఒక్కోసారి దయావర్షం కురిపిస్తాడు. ఎలా ఉన్నా నీమనస్సును నిర్మలంగా చేయటానికే, నీమనస్సును పవిత్రం చేయటానికి ఇవి అన్నీ చేస్తాడు. ఇది గుర్తించిన వారు అదృష్టవంతులు. నిర్మలమైన భక్తి, నిశ్చలమైన భక్తి ఉంటే నీయోగ క్షేమములను ఈశ్వరుడే చూసుకుంటాడు. మీ మనస్సు నిర్మలమైనప్పుడు మీయోగక్షేమములను భగవంతుడు ఎలా చూస్తున్నాడో మీకే స్ఫురిస్తుంది. గురువు మీ మనస్సు బంగారం చేసుకుంటూ పోతాడు. బజారుకి వెళ్ళి మనం బంగారం కొనుక్కోవచ్చు కాని గురువు అనుగ్రహం లేకుండా నీమనస్సును బంగారం చేసుకోలేవు మనస్సు బంగారం అయితేగాని, అంటే మనస్సు నిర్మలమైతేగాని నిశ్చలమైతేగాని దానికి అంతర్దృష్టి కలుగదు, అంతర్దృష్టి కలిగితేగాని దానికి ఆత్మజ్ఞానం కలుగదు. మనస్సును తన జన్మస్థలమైన హృదయంలోనికి వెళ్ళేవరకూ ఉపసంహరించుకుంటూ వెళ్ళాలి. ఆప్రక్రియలో లోకంలో ఏదో ఆకర్షణ సడన్‌గా వస్తుంది, నీమనస్సు గంతువేసి బాహ్యముఖానికి వచ్చేస్తుంది. ఏనుగు దేనికీ లొంగదు, ఒక్క సింహానికే లొంగుతుంది. అలాగే నీ మనస్సు ఒక్క గురువు అనుగ్రహానికే స్వాధీనమవుతుంది అని భగవాన్ చెప్పారు. గురువు నీలోపల ఉండి పనిచేస్తూ ఉంటాడు . ఆత్మానుభవం పొందటానికి ఏబలహీనతలు అడ్డు వస్తున్నాయో చూసి వాటిని తొలగించి నీకు మార్గం సుగమం చేస్తాడు. నీలో ఉన్న బలియమైన వాసనలను నీవు బయటకు గెంటలేవు. వాటిని గురువు తొలగిస్తాడు. ట్రాఫిక్‌జామ్‌ను పోలీసువారు ఎలా క్లీయర్ చేస్తారో అలాగే హృదయంలో ప్రవేశించటానికి నీవాసనలు, అలవాట్లు అనే ట్రాఫిక్‌జామ్ ను క్లియర్ చేసుకుంటూ నీవు హృదయంలోనికి వెళ్ళేవరకూ గురువు నీకు సహకరిస్తాడు.

> గ్రంథములు ఆత్మజ్ఞాన సముపార్జనకు మార్గమును సూచిస్తాయి. కాని ఆ మార్గములో ప్రయాణంచేసి ఆత్మజ్ఞానమును మనం పొందాలి. ఈనాటికైనా, ముందునాటికైనా ఆత్మానుభవం హృదయంలోనే కలుగుతుంది. హృదయంలో సద్వస్తువు ఉంది. కాని గ్రంథములలో లేదు. గ్రంథములవలన పాండిత్యం వస్తుంది. హృదయంలో వెతికితే అమృతత్వం కలుగుతుంది.
>
> – శ్రీ నాన్నగారు

# గుర్తింపు కోరుకోవటం ఆధ్యాత్మిక అభివృద్ధికి అవరోధం

ది. 25-11-2000 వేంద్ర గ్రామ సర్పంచి కుమారుడు భూపతిరాజు అప్పలరాజుగారి ఆహ్వానం మేరకు సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జీవకోటి అంతా భగవంతుడిలో నుండి వస్తారు మరల భగవంతుడిలో ఐక్యమవుతారు. ఈ శరీరాలన్నీ కేవలం స్వప్న మాత్రమే కాని ఈశరీరం నిజం, లోకం నిజం అని మనం అనుకుంటున్నాము. అందుచేత మనకు దు:ఖం వస్తోంది. మనకు ఈశరీరాలతో ఉన్న బంధం వలన దు:ఖం వస్తుంది. మనం ఇతరుల గురించి ప్రార్ధన చేయటం నేర్చుకోవాలి. ఒక జీవుడి గురించి మంచి కోరుతూ ఉంటే, ప్రార్ధిస్తూ ఉంటే, సహృదయం కలిగి ఉంటే వారి శరీరం ఉన్నా లేకపోయినా మన సహృదయాన్ని ఒక శక్తి తీసుకొని వెళ్ళి వారికి అందజేస్తుంది. అందుచేత ఇతరుల పట్ల ఎప్పడూ సహృదయం కలిగి ఉండాలి. ఇతరులకు మీ పట్ల అసూయ ఉన్నా మరల మీరు అసూయ పంచి పెట్టకూడదు, ప్రేమను, ఆప్యాయతను పంచిపెట్టాలి. దాని వలన మనస్సు పల్చ బడుతుంది. ఇతరులు మనలను ద్వేషిస్తూ ఉంటే మనం కూడ వారిని ద్వేషిస్తే మనస్సు చిక్క బడుతుంది. ఈదేహం,లోకం నిజం అనుకున్నంత కాలం మనం తత్వం గురించి ఎంత శ్రవణం చేసినా, ఎన్ని యోగాభ్యాసాలు చేసినా, ఏసాధన చేసినా తాత్కలికంగా మనస్సు లోపలకు వెళ్ళవచ్చుగాని సత్యవస్తువు మన హృదయంలో ఎంతలోతులలో ఉందో అంత లోతులలోనికి మనస్సు వెళ్ళదు. మన మనస్సు ఒక్కోసారి మనకు అనుకూలంగా ఉంటుంది, ఒక్కోసారి వ్యతిరేకంగా ఉంటుంది. పరిశీలన చేస్తే మనకు తెలుస్తూ ఉంటుంది. మనస్సు మనకు అనుకూలంగా ఉన్నప్పడు ఇతరులతో మాట్లాడవచ్చు, మనస్సు వ్యతిరేకంగా ఉన్నప్పడు సాధ్యమైనంత వరకూ మాటలు తగ్గించేయాలి.

లోకంతో అనుబంధం సాధ్యమైనంత వరకూ తగ్గించుకొంటూ ఉండాలి. లోకంతో అతిగా ఉంటే మనస్సు ఎక్కువగా బాహ్యముఖానికి పోతుంది. మన ఇంట్లో ఉన్న వస్తువులను ఎంత వరకు ఉపయోగించుకోవాలో అంత వరకు ఉపయోగించు కొంటాం గాని వాటిని కూడా వేసుకుని తిరగం. అలాగే లోకాన్ని కూడా ఎంత వరకు అవసరమో అంతవరకు ఉపయోగించుకోవాలి గాని అతిగా లోకంతో ఉండటం వలన

భగవంతునికి దూరం అవుతాము. సాధ్యమైనంత వరకూ ఇతరుల గొడవలలో కలుగజేసుకోవద్దు, దాని వలన అహంభావం పెరిగే ప్రమాదం ఉంది అని రమణస్వామి చెప్పారు. కొంత మంది మనస్సును లోపలకు ఉపసంహరించుకోవటానికి చూసుకోరు. ఆ శాస్త్రంలో ఇలా ఉంది ఈ శాస్త్రంలో అలా ఉంది అని పుస్తకాల పురుగుల క్రింద తయారవుతారు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నానని భగవంతుడు శాస్త్రంలో చెప్పాడు. కాని పుస్తకాలలో ఉన్నానని చెప్పలేదు. శాస్త్ర వాసన కూడా మనస్సును బాహ్యముఖం చేస్తుందిగాని మనస్సుకు అంతర్‌దృష్టి కలుగజేయదు. చదివింది ముందు నువ్వు అర్థం చేసుకో, అర్థం అయిన తరువాత నీవు ఎంత వరకూ ఆచరించగలవో అంత వరకూ ఆచరించు. మన మనస్సుకు ఎంత వరకూ అంతర్‌దృష్టి కలుగుతోంది అని మన దైనందిన జీవితంలో మనం చూసుకోవాలి. మనస్సు అనే సమస్య నిశ్శేషంగా పరిష్కారం అయ్యేవరకూ దేహం వస్తుంది, దేహం వస్తే లోకం వస్తుంది, లోకం వస్తే దేవుడు వస్తాడు. నిజం కానిది నిజంగా నీకు కనిపిస్తున్నంత కాలం ఎన్ని సాధనలు చేసినా జనన, మరణ ప్రవాహం నిన్ను విడిచి పెట్టదు. దుఃఖం విడిచి పెట్టదు. శరీరాన్ని బయటతోము కోవటం చిన్నతనం నుండి అందరికీ అలవాటు అయ్యింది. లోపల తోముకోవటం నేర్చుకోవాలి. మనం శరీరాన్ని రోజూ బయట తోముకుంటున్నాము. అలా లోపల తోముకుంటూ రావాలి. లోపల నుండి తోముకుంటూ వస్తే మనస్సులో ఉన్న జిడ్డు పోతుంది. అదే సాధన. లోపల పవిత్రుడు అవ్వటానికి చేసే ప్రతీపని సాధన. ఇతరులలో ఉన్న దోషాలను మనం చూడకూడదు. మనలో ఉన్న దోషాలను చూసుకొని వాటిని తొలగించుకొంటే మనం బాగుపడతాము. ప్రతీవాడు గుర్తింపు కోరుకుంటాడు. ఆగుర్తింపే వాడి ఆధ్యాత్మిక అభివృద్ధికి అడ్డు వస్తుంది. ఈశ్వరానుగ్రహం దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి గాని లోక విషయాలు దృష్టిలో పెట్టుకోకూడదు. లోక విషయాలు దృష్టిలో పెట్టుకుంటే లోకానికి దగ్గరవుతాము, దేవునికి దూరమవుతాము. మంచితనం పరమార్థంకాదు. పరమార్థం తెలుసుకోవటానికి మంచితనం సహాయం చేస్తుంది కాబట్టి మంచి చెయ్యమని చెప్పారు. మంచి చెయ్యటం వలన నీవు పవిత్రుడవు అవుతావు నీకు లోచూపు కలుగుతుంది. మంచి అంత వరకే గాని అదే గమ్యం కాదు. మీకు లోచూపు లేదు అనుకోండి మీకు వెయ్యికోట్లు డబ్బు ఉన్నా, వెయ్యి మేడలు ఉన్నా, ఎన్ని సంపదలు ఉన్నా మీకు శాంతి దొరకదు. నేను ఎవడను, నేను ఎవడను అని మంత్రం లాగ జపిస్తూ

ఉంటే నాకు ఏమీ తెలియటం లేదు మిగతా పద్ధతిలో ఏదోరూపం చూపించి ధ్యానం చేయమంటున్నారు. అక్కడ ఆలంబన చూపిస్తున్నారు. మీరు ఆలంబన చూపించకుండా ఈ మనస్సు గారు ఎవరు అని ప్రశ్నించ మంటున్నారు అని అడుగుతున్నారు అసలు ఆలంబనలు ఊడగొట్టడమే ఇక్కడపని. నీమనస్సుకు ఏవైతే ఆలంబనలు ఉన్నాయో అవి పడగొడితే కాని మనస్సు హృదయగుహలోనికి వెళ్ళదు.

మనం పని చేసేటప్పడు చేస్తే ఇష్టంగా చేస్తాము, లేకపోతే అయిష్టంగా చేస్తాము. ఇష్టం, అయిష్టం లేకుండా జీవితం పొడుగునా పనిచెయ్యి. నీడ్యూటీ నీవు సరిగ్గా చేస్తున్నావో లేదో చూసుకో నీవు రోజూ చేసే పనిలోనుండి పారిపోవటం అనేది అజ్ఞానానికి దారితీస్తుంది. కాని మనస్సుకు అంతర్ముఖత్వం కలుగదు. మనడ్యూటీ మనం సరిగా చేయకుండా కళ్ళుమూసుకుని కూర్చుంటే జ్ఞానం వచ్చేస్తుంది అనుకోకండి. ఏడ్యూటీ అయితే మనం సక్రమంగా చేయకుండా తప్పించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నామో మరు జన్మలో ఆపని మనకు ఇష్టం లేకపోయిన మన చేత భగవంతుడు చేయిస్తాడు. అందుచేత ఇష్టాయిష్టములను వదిలేసి నీ పని ఏదో నీవు సక్రమంగా చేసుకుంటూ వెళ్ళిపో అప్పడు నీకు యోగబుద్ధి కలుగుతుంది. యోగబుద్ధి వలన నీమనస్సుకు లోచూపు వస్తుంది. విచారణా మార్గంలో ప్రయాణం చేసేవాడు ఏమి చేయాలి అంటే మిగతా తలంపుల నుండి నేను అనే తలంపును వేరు చేయాలి. ఇష్టం, అయిష్టం, కోపం, దు:ఖం, సంతోషం ఇవి అన్నీ నేను అనే తలంపుకు వస్తున్నాయి. ఈ తలంపులలోనుండి నేను అనే తలంపును సెపరేట్ చేయాలి. ముందు ఆ క్లూ అర్థం అవ్వాలి నేను ఎవడను అర్థం చేసుకోవాలంటే పూర్వజన్మలో ఎంతోకొంత జ్ఞానమార్గంలో ప్రయాణం చేసి ఉండాలి. మన మనస్సులో పక్వత, అవగాహనశక్తి లేకపోతే భగవాన్ మాటలు మనకు నచ్చవు. నేను అనే తలంపు అణిగితే దానికి వచ్చే ఇతర తలంపులు అణిగిపోతాయి. అది అణగాలంటే ముందు ఇతర తలంపులలో నుండి నేను అనే తలంపును విడదీయగలగాలి. ఇతర తలంపులలో నుండి మూలతలంపును వేరుచేసి దాని మూలంలోనికి దానిని ఉప సంహరించాలి. మిగతా తలంపులలో నుండి నేను అనే తలంపును వేరుచేసే బుద్ధిని ఈశ్వరుడిని ప్రార్థించగా, ప్రార్థించగా, ఆయన మనకు ఇస్తాడు. నేను అనే తలంపు ఉంటేనే అంతా ఉంది, అదిలేకపోతే ఏదీలేదు. శరీరం లోపల నేనున్నాను, శరీరం బయట ప్రపంచం ఉంది అని తెలియజేసేది కూడా నేను అనే తలంపే. వీడే నరకాసురుడు. దైవ

సహాయంతో, గురువు యొక్క అనుగ్రహంతో వాడిని నాశనం చెయ్యి. మీ ఇంట్లో ఎవరైనా దుర్మార్గులు ఉంటే కంగారు పడకండి వారు మీకు లోచూపు కలుగజేస్తారు. మీరు చేసేసాధన అంతా దేహాభిమానాన్ని పోగొట్టుకోవటానికే. మిమ్మల్ని ఎవరైనా తిడితే మీదేహాభిమానాన్ని తిడతారు. అందుచేత వారుకూడా మీకు సహాయకారులే అని గుర్తించాలి. మంచి వారి మధ్య ఉంటే మిమ్మల్ని పొగిడేవారి మధ్య ఉంటే మోక్షం పొందటానికి వందజన్మలు పడితే మనల్ని ద్వేషించే వారి మధ్య ఉంటే ఒక్క జన్మచాలు. వారు మనకు సహనం నేర్పుతారు. మిమ్మల్ని పొగిడే వారి వల్ల కంటే, మిమ్మల్ని విమర్శించే వారివల్ల మీకు లోచూపు కలుగుతుంది. మీరు ఎన్ని పూజలు, జపాలు, ధ్యానాలు చేసినా మీకు గర్వం ఉంటే మీ సాధనను గర్వం తినేస్తుంది. గర్వం ఉంటే మీకు లోచూపు కలుగదు. ఎప్పుడో చనిపోయిన తరువాత ఏదో అవుతాము ఆగొడవ వద్దు. ప్రాణం ఉండగా సబ్జక్టు బాగా అర్థం చేసుకోండి. సబ్జక్టును విడిచిపెట్టి పారిపోవటానికి ప్రయత్నం చేయవద్దు. నీకు కొంత లోచూపు కలిగితే సాధనతో పనిలేకుండా నీ మనస్సు అక్కడే పడి ఉంటుంది. ఒక సంవత్సరం గుడులు చుట్టూ తిరిగి సాధన చేసిన దానికంటే సహృదయం ఉన్నవారి వద్ద పదినిమిషాలు కూర్చుంటే ఎక్కువ ఆధ్యాత్మిక బలం వస్తుంది. సబ్జక్టును అర్థం చేసుకోండి, మిమ్మల్ని మీరు వంచన చేసుకోవద్దు. తలంపులే పునర్జన్మలకు కారణం. తలంపులు లేకపోతే పునర్జన్మలు లేవు. తలంపులు అంత తేలికగా పోవు, ఎందు చేతనంటే పూర్వజన్మలో మంచివి అని వాటిని పెంచుకున్నాం. అందుచేత అవి వేగంగా పోవు. అవిపోవటానికి కొంతటైము పడుతుంది. తలంపే బంధం. తలంపులు లేకుండా మనిషికి బంధంలేదు. దేహము నేను అనేదికూడా నిజంకాదు. అది కూడా ఒక తలంపే. నీవు ఎవరిగా ఉన్నావో అలావుండే అలవాటుకు దూరమయ్యావు. అందువలన ఇప్పుడు కష్టం అనిపిస్తోంది. కష్టం అనుకోవడం కూడా నీ భావనే. మీరు కాని దానితో ఎంత కాలం అయితే తాదాప్యం చెందుతారో ఇది అంతా వడ్డీతో సహా పరిణామంలో దు:ఖాన్ని తీసుకొని రావడం ఖాయం. రైలులో ప్రయాణించేటప్పుడు పాసింజర్లు ఒకరితో ఒకరు కలసి మాట్లాడు కుంటారు, తినే పదార్థాలు ఒకరికి ఒకరు ఇచ్చుకుంటారు. ఎవరి స్టేషన్ వచ్చినప్పుడు వారు దిగి వెళ్ళిపోతారు. అలాగే ఇంట్లో కూడా మీరు ఒక రికి ఒకరు సహకరించుకోండి, ఇదంతా నిజం అనుకోవద్దు అలాగయితే మీరు బంధింపబడరు. రైలు ప్రయాణికులు వారి స్టేషన్ వచ్చేవరకూ ఎలా ఆప్యాయంగా ఉంటారో అలాగే మీకు

చావు వచ్చే వరకూ ఇంట్లో అలా ఆప్యాయంగా ఉండండి.

వారు చెడ్డవారు, వీరు మంచివారు అనే గొడవ వద్దు. అదికూడా ఒక తలంపే. మూలతలంపును పట్టుకొని దాని మూలంలోనికి వెళ్ళు. అది విచారణ అంటే మూల తలంపు ఏమిచేస్తోంది అంటే మూలంలోనికి వెళ్ళటం మానేసి కాని దానితో తాదాప్యం చెందుతోంది. దానిని విడదీస్తే ఏమీలేదు. నేను అనే తలంపు హృదయంలో నుండే వస్తుంది, మీరు ఎవరుగా ఉన్నారో అక్కడ నుండే వస్తోంది, పరాయి చోటు నుండి రావడం లేదు అది ముందు అర్థమవ్వాలి. సుబ్రహ్మణేశ్వర స్వామికి గుహేశుడు అనిపేరు అంటే గుహలో ఉన్న ఈశ్వరుడు. ఆ హృదయగుహలో నీవు ఉండగలిగితే నాలుగు యోగాలు ఆచరించినట్లే. విచారణ ప్రారంభిస్తే విచారణ ప్రారంభంలోనే మనస్సు అదృశ్యమవుతుంది హృదయగుహ దగ్గరకు వెళ్ళేసరికి ఆవస్తువు యొక్క శాంతి, సుఖం నీకు తెలుస్తూ ఉంటాయి. ఏకారణాల వలన నీ మనస్సు బాహ్యముఖంఅవుతోందో ఆ కారణాలు నశించే వరకు లోపలకు ప్రయాణం చేస్తూనే ఉండాలి. ఒక్కో కారణం నీ మనస్సును బాహ్యముఖం చేస్తుంది. మనస్సును ఆకారణంలోనుండి తప్పిస్తేగాని మనస్సు లోపలకు వెళ్ళదు మూలతలంపు మూలాన్ని తెలుసుకోవటానికి ఎంత టైము పడుతుంది అంటే దాని మూలంలోనికి వెళ్ళి అది అక్కడ స్థిరపడేవరకూ లోపలకు ప్రయాణం చేస్తూ ఉండవలసిందే. నీకు విచారణా మార్గం నచ్చకపోయినా నీకు నచ్చిన ఏదో ఒక మార్గం ద్వారా లోపలకు ప్రయాణం చేయవలసిందే. నేను చెప్పిన పద్ధతి నీకు నచ్చకపోవచ్చు కాని నీకు నచ్చిన పద్ధతిలో ప్రయాణం చెయ్యి. ప్రయాణం మాత్రం విడిచిపెట్టవద్దు. మీరు తరించటం ముఖ్యం కాని నేను చెప్పిన మార్గాన్ని మిమ్మల్ని అనుసరించమనికాదు. నీ మనస్సుకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి. ఒక మార్గం ఇష్టం అయితే అందులో ప్రయాణం చెయ్యి లేకపోతే అన్ని మార్గాలు సమన్వయం చేసుకొని వెళ్ళు ఇబ్బంది ఏమీలేదు. నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా నేను అనే తలంపు నీకూడా వస్తుంది, ఈశనిగాడు తప్పదు. వీడిని పరిష్కారం చేసుకోవాలి. వీడిని పరిష్కారం చేసుకోపోతే నీకు మోక్షంరాదు. ఈ నేనును పరిష్కారం చేసుకునే వరకూ ఏదో రూపంలో మీకు సాధన తప్పదు. నదులు ఎన్ని వంకరలు తిరిగినా సముద్రంలోనికి వెళ్ళేవరకూ అలా ప్రవహిస్తూ ఉండవలసిందే అలాగే ఈనేను అనే తలంపు బ్రహ్మంలో ఐక్యమయ్యే వరకూ నీవు ఏదో రూపంలో సాధన చేస్తూ ఉండవలసిందే, సాధన తప్పదు. సాధనలో ఎంత

మెలుకువగా ఉండాలంటే ఎవరో మిమ్మల్ని శత్రువులు అనుకుంటారు అనుకోండి మీరు మాత్రం వారిని శత్రువులు అనుకోకూడదు. అలా అనుకుంటే వారి వలలో మీరు పడినట్లే. మనం ఏమి చేస్తున్నాము అంటే మరణం లేని వస్తువును మరణించే దేహంతో కలిపేసి ఈదేహమే ఆత్మ అనుకుంటున్నాము. ఉన్న చిక్కంతా ఇదే. నువ్వు చేయవలసింది ఏమిటి అంటే ఆత్మను ఈదేహంతో కలపటం మానివెయ్యాలి. నీవు చేయవలసింది ఇదే. అప్పుడు నీవు ఎప్పుడూ ఉంటావు అన్న సంగతి నీకు తెలుస్తుంది.

## జిన్నూరులో స్మార్త పండిత సభ





జిన్నూరు శ్రీ ఉమా చెన్నమల్లేశ్వర స్వామి, పార్వతి అమ్మవార్ల దేవస్థానమునందు జనవరి 21 ఆదివారం వేదపండితులు నిర్వహించిన స్మార్త పండిత సభ, వేద పారయణం శ్రీ నాన్నగారిని బాగా ఆకర్షించింది. జిన్నూరు గ్రామ పురోహితులు సద్గురు శ్రీ నాన్నగారి ఆధ్వర్యములో పరిసరగ్రామ పురోహితులను, వేద పండితులను ఆహ్వానించి ప్రతి సంవత్సరము వారు ఇదేరోజు పండిత సత్కారము నిర్వహించాలని, వేద పారాయణము జరిపించాలని నిర్ణయించారు.

# ఫలం మీద దృష్టి లేనికర్మ శాంతికి దారి తీస్తుంది

ది. 24-12-2000 శ్రీరమణ క్షేత్రం - జిన్నూరులో సద్గురు శ్రీనాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అందరి హృదయాలలో భగవంతుడు ఉన్నాడు, చైతన్యం ఉంది అని చెపుతున్నారు. ఇలా నోటితో చెప్పిన ప్రయోజనం లేదు. అది మనకు అనుభవంలోనికివస్తే దాని తాలుక సుఖం, శాంతి మనకు తెలుస్తుంది. ఇప్పడు మనకు మనస్సు అనుభవంలో ఉంది అందువలన మనస్సులో ఉన్న గుణాలు మనకు తెలుస్తూ ఉంటాయి. అలాగే చైతన్యం మనకు అనుభవంలోనికివస్తే దాని తాలుక సుఖం, శాంతి నీకు అందుతాయి. మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు. మీరు సాధనా ప్రక్రియను విడిచిపెట్టేస్తున్నారు. సాధన లేకపోతే సిద్ధికలుగదు. భగవదనుభవం పొందటానికి మనకు ఒక అవకాశం ఇచ్చాడు. ఇది మనం ఉపయోగించుకోవాలి. ఇప్పడు మనం ఈ భూమిమీద ఉన్నాం. ఏదోరోజు ఈ శరీరానికి మరణం వస్తుంది. ఏరోజు ఈ శరీరానికి మరణం రావాలో నిర్ణయం అయిపోయింది కాని అది మనకు తెలియదు. జీవితాన్ని మనం పొడిగించుకోలేము. ఈ శరీరం ఉండగానే కాలాన్ని ఉపయోగించుకొని మరణంలేనిస్థితిని మనం పొందలేకపోతే మరల ఇలా శరీరాలు మోయటం తప్పదు. జన్మించటం, మరణించటంలో చాలా విషాదం ఉంది, దుఃఖం ఉంది అన్నసంగతి మనకు తెలియటంలేదు, ఎందుకు తెలియటంలేదు అంటే మనకు వైరాగ్యంలేదు. సాధనచేసినా మనస్సు నిలబడటంలేదు అనుకోండి దానికి కారణం వైరాగ్యం లేకపోవటం. మనస్సుకు ఏకాగ్రతవస్తే, మనస్సుకు అంతర్‌దృష్టికలిగితే మనంచేసేపని పూర్వంకంటే ఇప్పడు బాగా చేయగలం, చాలా ఓర్పుగా, నేర్పుగా చేయగలం. బుద్ధిమంతుడు తనలోని దోషాలను చూసుకొంటాడు, బుద్ధిమంతుడుకానివాడు ఇతరులలోని దోషాలను చూస్తాడు. ఇతరులలోని దోషాలను చూస్తే ఏమీ ప్రయోజనంలేదు. మనలోని దోషాలను చూసుకొని వాటిని తొలగించుకొంటే మనకు శాంతి కలుగుతుంది.

నీ చేతిలో ఉన్నపనిని ఇష్టంగా చెయ్యి, ప్రేమగా చెయ్యి. దేహప్రారబ్ధాన్ని బట్టి ఫలం రావచ్చును, రాకపోవచ్చును. దైవ చింతనతో పనిచెయ్యాలి. శరీరాన్ని, లోకాన్ని మనస్సే కల్పించింది. అది కల్పించుకొన్న విషయాలతోనే మనస్సు ఉంటుంది. మనస్సు కల్పించిన విషయాల నుండి మనస్సును విడదీసేవాడే సాధకుడు. కాని మనం

ఏమిచేస్తున్నాము అంటే విషయాలనుండి మనస్సును విడదీయటానికి బదులు అందులో కూరుకొనిపోతున్నాము. అది కొన్నివేల జన్మలకు కారణం అవుతుంది. రామచంద్రమూర్తికి లక్ష్మణస్వామి సేవ చేసాడు, కేవలం అనుగ్రహంకోసం చేసాడు. అది భక్తి అంటే మనందరం ఫెయిలైపోయిన భక్తులం. కోరికలు కోరుతున్నాము అందువలన మనం ఫెయిలైన భక్తులం. కోరికలు లేనిస్థితికి వచ్చాము అనుకోండి మనం పాసైపోతాము. భగవంతునిమీద భక్తి ఉండాలి, కోరికలు ఉండకూడదు అప్పుడు మనం పాసవుతాము. మనం లోకంలో ఏదైనా పనిచేసాము అనుకోండి దానివలన లోపల హృదయంలో ఉన్న ఈశ్వరుడు ఎంత వరకు సంతోషిస్తున్నాడు, ఆయన అనుగ్రహానికి ఎంతవరకు పాత్రులవుతున్నాము అది చూసుకొని పనిచేయాలిగాని లోకం ఊరేగింపుల కోసంకాదు. లోకం ఊరేగింపులకోసం చేస్తే లోకానికి దగ్గరవుతాము, భగవంతునికి దూరమవుతాము. లోకంలో ఏదో ఉంది అని మనకు అనిపిస్తుంది. లోకంలో ఏదో ఉంటే దానిని పొందటానికి ప్రయత్నం చేయవచ్చునుకదా మరి నీకు నిద్ర ఎందుకు అంటున్నారు భగవాన్. నిద్రలో ఉన్న సుఖం లోకంలో ఎక్కడా లేదు. దేహంతోగాని, మనకు ఉన్న అధికారంతోగాని, బాహ్యమైన వస్తువులతోగాని సంబంధం లేకుండా గాఢనిద్రలో మనం సుఖం అనుభవిస్తున్నాము. ఎందుకంటే లోపల ఉంది కాబట్టి అనుభవిస్తున్నాము. సుఖం అనేది లోకంలో ఎక్కడా లేదు, హృదయంలోనే ఉంది అనే గాఢమైన విశ్వాసం సాధకుడికి కలగాలి. ఎక్కడైతే సుఖం ఉందో అక్కడ నిజంగా సుఖం ఉంది అని నీ మనస్సు నమ్ముతుంటే అది నిజమైన విశ్వాసం. జరిగేది ఈశ్వర సంకల్పమే తదనుగుణంగా నువ్వు పనిచెయ్యి అప్పుడు నీవు ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు.

చావు, పుట్టుక, గర్వం, అసూయ, సంతోషం, దుఃఖం అన్నీ తలంపులే. మనం ఏ రకమైన తలంపులు లేనిస్థితికి వస్తే హృదయంలో ఉన్న వస్తువు నీకు ప్రత్యక్షముగా అనుభవంలోనికి వస్తుంది. లోపల ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి రానప్పుడు ప్రయోజనం లేదు. సాధన యొక్క ప్రయోజనం ఏమిటి అంటే దేహాభిమానాన్ని తగ్గించుకొంటూ రావాలి. దేహాభిమానం ఉన్నప్పుడు పునర్జన్మ వస్తుంది. దానిని ఒక్కరోజే తగ్గించుకోలేము, నెమ్మదిగా తగ్గించుకొంటూరావాలి. దానిని తగ్గించుకోవాలంటే ఎంతో కొంత స్వార్థం లేకుండా పనిచేయాలి. స్వార్థం లేకుండా పనిచేయటంవలన మన మనస్సుకు అంతర్ముఖత్వం కలుగుతుంది. నేనువేరు, ప్రపంచంవేరు, దేవుడువేరు అనే

భేదబుద్ధి రావటానికి నీలో ఉన్న కర్తృత్వం కారణం. నీమాట, చేత, ఆలోచన కర్తృత్వం తగ్గటానికి సహకరించాలి. కర్తృత్వం తగ్గేకొలది వేరుబుద్ధి నశిస్తుంది. వేరుబుద్ధి నశించినప్పడు ఈశ్వరభావన కలుగుతుంది, సర్వత్రా నీవే ఉన్నావన్నసంగతి నీకు అనుభవంలోనికి వస్తుంది. ఈశ్వరుడు చెప్పిన మాటలమీద మనకు గౌరవం రాలేదు, ప్రమాణబుద్ధి రాలేదు అందువలన ఇష్టం కుదరటంలేదు. ఇష్టం కుదరలేదు కాబట్టి సాదన చేయలేకపోతున్నావు. ఇష్టం కుదరటానికి, సాధన చేయటానికి, ఈశ్వరానుభవం పొందటానికి మనం ఈభూమి మీదకు వచ్చావు. మనం పొందవలసిన ట్రైనింగ్ అదే. మనం బూటకపు మనుషులు చెప్పేమాటలు నమ్ముతాంగాని భగవంతుడు చెప్పినమాటలు నమ్మటంలేదు. బాహ్యచూపుఉన్న మనం లోచూపు కలుగజేసుకోవటానికి ఈభూమి మీదకు వచ్చాం. వచ్చినపని మనం మర్చిపోకూడదు. సత్పురుషులు, జ్ఞానులు, మహాత్ములు, సహృదయం ఉన్నవారు ఎవరినీ విమర్శించరు, వారిని సరిచేయటానికి చూస్తారు. భగవాన్ సమక్షంలో ఎవరైనా కూర్చొన్నారు అనుకోండి ఆయన మౌనంగానే ఉండేవారు ఎవరిని ఏమీ అనేవారుకాదు. వారిలో పునర్జన్మ హేతువులు ఏమి ఉన్నాయో చూసి వాటిని తొలగించటానికి, మారు మనస్సు తీసుకొనిరావటానికి కృషిచేసేవారు. అది గురువుయొక్క కృప.

నీ దేహప్రారబ్ధంలో ఏపనిచేయవలసి ఉందో ఆ పనిని ఇష్టంతో చెయ్యి. ఒక పని ఎక్కువ, ఒకపని తక్కువ అని అనుకోకూడదు. దేహంలో ఉన్న అవయవాలలో కన్ను ముఖ్యమా, చెవి ముఖ్యమా అంటే ఏమిచెపుతాము. ఏ అవయవం చేసేపని అది చేయవలసిందే. అలాగే సమాజంలో ఎవరుచేసేపని వారు వారి దేహప్రారబ్ధమును బట్టిచేస్తూ ఉంటారు. అన్నిపనులు చేసేవారు సమాజానికి అవసరమే. ఇందులో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అని బేదబుద్ది పెట్టుకోకూడదు. కర్తలేని కర్మ నీకు జ్ఞాన సముపార్జనకు సహకరిస్తుంది. నీవు నిర్మలంగా, నిశ్చలంగా, కర్మఫలాన్ని ఆశించకుండా పనిచేస్తూ ఉంటే చిత్తశుద్ధికి అది నీకు సహకరిస్తుంది, తరువాత నీకు జ్ఞానోదయం కలుగుతుంది. ఒక జీవుడికి ఉపయోగంలేని అలవాట్లు ఉన్నాయి అనుకోండి ఈ అలవాటు ఎక్కడ నుండి వస్తోంది, ఎందుకు వస్తోంది అని చూసుకున్నా, దాని మొదలు చూసుకొన్నా ఆ అలవాటు పడిపోతుంది. అయితే విచారణ చేయాలన్న బుద్ధి కలగటానికి వాడికి సజ్జనసాంగత్యం, సత్పురుషులతో సహవాసం అవసరం. ఈశ్వరానుభవం

పొందలేము అనుకొంటావేమో అలా అనుకొంటే నీ తలంపే నీకు అడ్డు అవుతుంది. నువ్వు తప్పక పొందుతావు. నెగిటివ్‌తింకింగ్ వద్దు. ఎప్పుడూ పాజిటివ్‌తింకింగ్ ఉండాలి. నెగిటివ్‌తింకింగ్ నీ ఆరోగ్యానికికూడా మంచిది కాదు. సొంత ఆలోచనలేనివాడికి ఆత్మశాంతిగాని, ఆత్మజ్ఞానంగాని కలిగే అవకాశంలేదు. స్వతంత్రమైన ఆలోచన కోసమే ఈ భూమి మీదకు వచ్చాము. భగవంతుడు మనకు ఒక అవకాశం ఇచ్చాడు దానిని మనం ఉపయోగించు కోవాలి. మనకు ఆలోచనే ప్రధానంగా ఉండాలి. ఒక మనిషి భౌతికంగా అభివృద్ధి పొందాలన్నా ఆధ్యాత్మికంగా అభివృద్ధిపొందాలన్నా మనకు అడ్డదారులు అంటూ ఏమీలేవు. మీరు కష్టపడి సాధనచేసి అభివృద్ధిలోనికి రావలసిందే. ఏదో మహిమలవలన నీ హృదయంలో ఉన్న శాంతి నీకు దొరుకుతుంది అంటే మీరు నమ్మకండి. దీనికి షార్ట్‌కట్స్ అంటూ ఏమీలేవు. మీరు కష్టపడి సాధనచేసి భగవదనుభవం పొందాలి. ఏ తలంపు అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో ఆతలంపే నీ బేదబుద్ధికి కారణం. కర్తృత్వబుద్ధిపోయింది అనుకో నువ్వు, నేను, ఈ లోకం అంతా ఒకే ముద్దక్రింద అయిపోతాం. మన దేహంద్వారా ఏ పనిజరగవలసి ఉందో అది జరిగిపోతూ ఉంటుంది. మన ప్రారబ్ధంలో ఉన్న పనిని మనం తప్పించుకోలేము అందుచేత ఆ పనిని ఇష్టంగా, ప్రేమగా, ఇతరులక్షేమంకోరి చెయ్యి. ఆత్మ, చైతన్యం అంటే ఎవరో అనుకోకండి అది మనమే. అది మనమే అన్న సంగతి మనలో ఉన్న వేరుబుద్ధి మనకు తెలియకుండా చేస్తోంది. దానిని తీసి ఒకప్రక్కన పెట్టటమే సాధన యొక్క లక్ష్యం. ఈశ్వరుడిని ధ్యానించు, ఈశ్వరుడిని స్మరించు, నువ్వు ఎవరికైనా పండు ఇస్తే ఈశ్వర భావనతో ఇయ్యి. నువ్వు ఒకమాట మాట్లాడితే, ఒకపనిచేస్తే ఎందుకు చేస్తున్నావో లోపలఉన్న ఈశ్వరుడుచూస్తూ ఉంటాడు. నీలోపల ఉన్న ఈశ్వరుడికి ఆనందం కలిగింది అనుకో, సాధన చేసి నీలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడి అనుగ్రహం పొందావు అనుకో మిగిలేది నీకు మోక్షం, ఆయన స్వరూపం నీకు ఇస్తాడు. భగవంతుడు సర్వసాక్షి నీవు చేసేపనిని చూస్తూనే ఉంటాడు. ఇతరుల గుర్తింపు కోరవద్దు, గుర్తింపు కోరుతూ ఉంటే దేహాభిమానం పెరుగుతుంది. దేహబుద్ధి ఎవరికైతే ఎక్కువగా ఉందో వాడే మహాపాపి అని భగవాన్ చెప్పారు. కొంతమంది ఏపని చేసినా వారి దేహాన్ని మర్చిపోయిమాత్రం పనిచేయరు, వాడే పాపి అన్నారు భగవాన్. కొంతమంది మంచిపనులు చేసి శిరస్సుమీద మోస్తూ ఉంటారు, అలా మోయటం వలన నీకు చిత్తశుద్ధి కలుగదు.

నీ హృదయంలో ఉన్న సత్య వస్తువును ధ్యానం చేస్తూ ఉంటే నీకు దేహాభిమానం తగ్గుతోంది అనుకో, సహృదయం కల్గింది అనుకో, నీ లోపల ఉన్న సత్యవస్తువు నీకు ప్రత్యక్షానుభవంలోనికి వస్తుంది అనుకో, అప్పడు నీకు లక్షలాది జన్మలు తీసుకొనివచ్చే సంచితకర్మ నీలోపల ఉన్నప్పటికీ అది అంతా కాలిబూడిద అయిపోతుంది. కొంతమంది ప్రతీచిన్న విషయానికి కోపం తెచ్చుకొంటారు. అది ఒక దోషం. ఎదుటి మనిషిలో లోపం ఉన్నప్పడు దానిని తొలగించటానికి ప్రయత్నం చేయాలిగాని వారిని చూసి అసహ్య పడకూడదు. నీ ద్వారా పనిచేసేవాడు ఈశ్వరుడే. ఈశ్వరుడే పనిచేస్తున్నప్పటికి నేను చేస్తున్నాను అనే తలంపు ఎందుకు వస్తోంది అంటే దేహమే నువ్వు అనుకోవటం వలన నీకు అలా అనిపిస్తోంది. మనం ఒక మంచిపని చేసాము అనుకోండి. ఆ మంచిపని చేయాలనే సంకల్పం ఇచ్చిందికూడా ఈశ్వరుడే. ఈశ్వరానుగ్రహం లేకపోతే మనకు ఆ సంకల్పమేరాదు. దేహం పుట్టుక పుట్టుకకాదు, దేహం చావు చావుకాదు. వాటిని మీరు పట్టించుకోవద్దు. రెండూ స్వప్నంతోటి సమానమే అన్నారు భగవాన్. దేహము నేను అనే తలంపు ఎప్పడు జన్మించిందో అప్పడు నిజంగా జన్మించావు. దానిని తొలగించుకోవటానికే రిపీటెడ్‌గా, రిపీటెడ్‌గా ఈ భూమి మీదకు నువ్వు వస్తున్నావు. ఆ తలంపును తొలగించుకోవటమే నీ జీవిత గమ్యం. మనం ఒకమాట మాట్లాడినా, ఒక తలంపు వచ్చినా దాని వలన మన హృదయంలో ఉన్న ఈశ్వరుడు సంతోషిస్తున్నాడో లేదో చూసుకోవాలిగాని లోకం మీదకు మన మనస్సు వెళ్ళకూడదు. నువ్వు పాలకొల్లు నడిచి వెళుతున్నావు అనుకో. కాళ్ళు నడుస్తూ ఉంటాయి. నేను నడుస్తున్నాను అని నీవు అనుకోవు. అలా అనుకోకపోయినా నీవు పాలకొల్లు వెళ్ళిపోతావు. నీవు చేసే పనికూడా అలాగ చేయాలి. నేనును తీసి ప్రక్కన పెట్టి పనిచేసుకొంటూ వెళ్ళిపోతే ప్రశాంతంగా వెళ్ళిపోతావు, టైర్ అవ్వవు, నీ గమ్యాన్ని చేరుకొంటావు. పరిసరాల మార్పిడివల్ల పెద్ద ప్రయోజనం ఏమీలేదు. ఉన్న అవరోధం, ఉన్నచిక్కులన్నీ నీ మనస్సులోనే ఉన్నాయి, బయట ఏమీలేవు. బయట ఏదో ఉంది, ఏదో ఉంది అనుకొంటున్నావు. బయట ఏమీలేదు. అవరోధం అంతా మనస్సులోనే ఉంది, ఆ మనస్సు అణిగిపోతే ఏమీలేదు అని తెలుసుకోవటానికే నీవు జన్మించావు, ఈ భూమి మీదకు వచ్చినపని అదే. ఒకవేళ అది తెలుసుకోకుండా నువ్వు వెళ్ళిపోతావు అనుకో వచ్చిన ప్రయోజనం సున్న, నీ జీవితం సున్నా. మనస్సు విషయాలను చింతించమంటే చింతిస్తుందిగాని

ఆత్మను చింతించదు. ఎందుచేతనంటే ఆత్మను చింతించగా, చింతించగా తాను ఉండనన్న సంగతి మనసుకు తెలుసు అందుచేత అది ఆత్మను చింతించదు, దాని నాశనం అది కోరుకోదు.

నువ్వు ఇంట్లో ధ్యానం చేసుకొంటున్నావా, గుడిలో ధ్యానం చేసుకొంటున్నావా, నదీ తీరంలో ధ్యానం చేసుకొంటున్నావా అది ముఖ్యం కాదు. శరీరం ఎక్కడో ఒకచోట ఉంటుంది. ఎక్కడ ధ్యానం చేస్తున్నావు అనేది ముఖ్యం కాదు, మనస్సును ఎంతవరకు అధిగమిస్తున్నావు అనేది ముఖ్యం. మనస్సు యొక్క పీడ, మనస్సుయొక్క రోత ఎంతవరకు తొలగించుకొంటున్నావు అది ముఖ్యంగాని నీవు ఎక్కడ ఉండి ధ్యానం చేస్తున్నావు అనేది ప్రధానం కాదు. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా మనోనాశనానికే. నీ పద్ధతిలో నీవు సాధనచేసుకో కాని నీ గమ్యం మనోనాశనం. ఎందుచేతనంటే పునర్జన్మ హేతువులు అన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సు నశిస్తే అన్నీ పోతాయి. నువ్వు ఎక్కడ సాధన చేస్తున్నావు అనేది ప్రధానంకాదు, మనోనాశనం ఎంతవరకు అవుతోంది అనేది ప్రధానం. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఈ మనస్సు అనే తెరను కత్తిరించకపోతే, దానిని అధిగమించలేకపోతే నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు సాక్షాత్కారం కాదు. తడి గుడ్డను పిండితే నీరు ఎలాకారుతుందో అలాగే నీవు చేసే సాధన నిజమైతే నీ మనస్సులో ఉన్న వాసనలు అలా రాలిపోతాయి. ఏప్రియల్ నెలలో అరుణాచలం వెళతాముకదా అక్కడ సాధన చేసుకొందాము అనుకొని ఈ మూడు నెలలు మనస్సును విచ్చలవిడిగా వదిలేస్తే అది నీ మూర్ఖత్వానికి గుర్తు. నీ దేహం ఎక్కడ ఉన్నా మనోనాశనానికి చేసే ప్రయత్నం విడిచిపెట్టకు. నీవు ఎక్కడికి పారిపోనక్కరలేదు, ఉన్న చోటనే ఉండు, చేస్తున్న పనినే చేస్తూ ఉండు. మనం పని దొంగల క్రింద అవ్వవద్దు. పని మనలను విడిచిపెట్టాలి గాని మనం పనిని విడిచిపెట్టకూడదు. మనం సర్వసాధారణంగా మన యజమానికి, పరమేశ్వరునికి దూరంగా ఉంటాము, లోకానికి విషయాలకు దగ్గరగా ఉంటాము. నీ చేతులతో పని చేస్తున్నప్పటికీ నీ మనస్సును ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచు. నీ కంట్రోలర్ నీ హృదయంలోనే ఉన్నాడు, నీ మనస్సును అక్కడే ఉంచు. మన తలంపులు, ఆలోచనలు, కోరికలు అన్నీ మనలోపల నుండే వస్తున్నాయి. ఈ తలంపులు ఎక్కడనుండి వస్తున్నాయో ఆ మూలాన్ని మనం పట్టుకోవాలి. ఆ మూలాన్ని పట్టుకోవటానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము. నీ మనస్సును ఏకాగ్రం చేసి దాని మూలం దగ్గరకు

మనస్సును ఎవడైతే ఉపసంహరింపజేస్తున్నాడో వాడే నీ గురువు. ఆ మూలాన్ని నీవు తెలుసుకొంటే నువ్వు ఎక్కడ ఉన్నా ఏకాంతవాసమే. జీవుడు, ఈశ్వరుడు నీ లోపలే ఉన్నారు అని చెపుతారు. ఎందుకు పనికిరానివాడు నీకు అనుభవంలో ఉన్నాడు. అంటే జీవుడు నీకు అనుభవంలో ఉన్నాడు వాడు నిన్ను సుఖపెట్టడు. సుఖపెట్టేవాడు నీకు అనుభవంలో లేడు. అనుభవంలో లేనప్పడు నీకు ప్రయోజనం లేదు, ఆ సుఖం నీకు అందదు. ఈశ్వరుడు యొక్కదయ, అనుగ్రహం మనకు కలుగకపోతే జ్ఞానం రాదు, మోక్షం రాదు. మనం సాధనచేసి, మనస్సును పవిత్రం చేసి కొంతలోపలకు నెట్టినా ఈశ్వరానుగ్రహం ఉంటే మనస్సును లోపలకు లాక్కొంటాడు, ఈశ్వరానుగ్రహంలేకపోతే వాంతు వచ్చినట్లు అది బయటకు వచ్చేస్తుంది. అందుచేత గుర్తింపులకోసం పనిచేయకండి. హృదయపూర్వకంగా పనిచెయ్యండి. ఈశ్వరానుగ్రహం పొందటంకోసం పనిచెయ్యండి.

జరిగేది అంతా ఈశ్వరసంకల్పం, అనుకొనేది మన సంకల్పం. నీ వలన ఏదో అవుతుంది అనుకొంటున్నావు. నీ వలన ఏదీ జరుగదు అని తెలిసే వరకు సాధన చెయ్యి అన్నారు భగవాన్. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా, ప్రేమగా, హృదయపూర్వకంగా చెయ్యి. కర్మఫలం ఎప్పుడు ఇవ్వాలో ఈశ్వరుడే ఇస్తాడు. కర్మఫలం ఆశించకపోతే రాదని అనుకొంటున్నావు. అది జీవలక్షణం. ఆశించిన వాడికంటే ఆశించనివాడికి ఎక్కువ వస్తుంది. ఏమతంలో ఉన్నా ఏ కులంలో ఉన్నా, స్త్రీఅయినా, పురుషుడు అయినా జీవలక్షణాలు నశించకుండా జ్ఞానోదయం కలుగదు. రమణమహర్షికి ఎందుకు జ్ఞానం కలిగింది, రామకృష్ణుడికి ఎందుకు జ్ఞానం కలిగింది అలా అనుకోనక్కరలేదు. ఆదీపాలనుబట్టి మన దీపాలను వెలిగించుకోవాలి, వారి ద్వారా మనం ప్రకాశం పొందాలి. ఏ గురువును ఆరాధించినా, ఏదేవుడిని స్మరించినా మీ మనస్సు నిర్మలంగా, నిశ్చలంగా, శాంతిగా ఉండాలి అది ముఖ్యం. ఏ దేవతాపురుషుడిని ఆరాధించటం వలన మీ మనస్సుకు శాంతి కలుగుతుందో ఆ దేవతనే ఆరాధించండి. మనస్సు యొక్క పీడను వదిలించుకోండి. ఆ పీడను వదిలించుకోవటానికి ఎక్కడికో పుణ్యక్షేత్రాలకు, హిమాలయాలకు వెళ్ళేవరకు ఆగనక్కరలేదు. ఇక్కడకూడా ప్రయత్నం చేసుకోండి అని చెపుతున్నారు.

## క్రీడలను ప్రోత్సహిస్తున్న M.L.A., శ్రీ అల్లు కు శ్రీ నాన్నగారు అభినందన



జనవరి 9,10,11 తేదీలలో పాలకొల్లు B.R.M.V.M. హైస్కూలు ఆవరణలో స్థానిక శాసన సభ్యులు శ్రీ అల్లు వెంకట సత్యనారాయణ గారి ఆధ్వర్యంలో నిర్వహించబడ్డ పద్మశ్రీ అల్లు రామలింగయ్య గేమ్స్ & స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతి ప్రధానం చేయుటకు సద్గురు శ్రీనాన్నగారు విచ్చేసారు. ఈ క్రీడలలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు సాధన చేసినపుడే తగిన విజయాన్ని పొందగలరని, తమనుకొన్న గమ్యాన్ని వారు చేరగలరని ఆయన అన్నారు. విద్యార్థులలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుటకు కృషిచేస్తున్న పద్మశ్రీ అల్లు రామలింగయ్య, అల్లు వెంకట సత్యనారాయణగార్లను ఆయన అభినందించారు. ఆటలపట్ల ప్రజలను యింకా ఆకర్షింపచేయాలని తద్వారా దురభ్యాసాలకు వారిని దూరంగా వుంచవచ్చునని ఆయన తెలియజేసారు. ఎవరైన ఉపన్యాసాలు యివ్వటం ముఖ్యం కాదని ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయటం ప్రధానమని ఆయన అన్నారు.

## జిన్నూరు వాలీబాల్ పోటీల బహుమతి ప్రధానోత్సవంలో శ్రీ నాన్నగారు




జిన్నూరు అల్లూరి సత్యనారాయణ రాజు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ జనవరి 13, 14, 15 తేదీలలో నిర్వహించారు.


ది. 13న శ్రీ అల్లు వెంకట సత్యనారాయణ, పాలకొలు ఎమ్మెల్యే పోటీలను ప్రారంభించగా, పాలకొల్లు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ వేగేశ్న రంగరాజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. 15న బహుమతి ప్రధానోత్సవ సభకు సద్గురు శ్రీ నాన్నగారు ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుతులు అందజేసారు.

సంఘం గౌరవాధ్యక్షులు శ్రీ పెన్మెత్స శ్రీరామరాజు, అధ్యక్షులు శ్రీ పెన్మెత్స రామకృష్ణంరాజు, కార్యదర్శి శ్రీ గాదె జనార్ధన గుప్త, కోశాధికారి శ్రీ పెన్మెత్స ఆంజనేయరాజు, కార్యవర్గ సభ్యులు మరియు హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ డి.వి. రామారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీ జి. నారాయణరాజుకు పూర్వవిద్యార్థి సంఘం తమ కృతజ్ఞతలు తెలియజేసింది.



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

REGISTERED NEWS PAPER

RNI NO. APTEL/1999/1667-POSTAL REGN.NO. AP/VJA/32/5/2000




To

A. Lakshmi
Plot No. 150, Rao & Raju Colony
Banjara Hills, Road No. 2
HYDERABAD - 500 034

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278